తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
30 ఆగస్టు 2026

## చిల్లరే.. లెక్కేస్తే రూ.లక్షలే..!

- పెద్ద శంకరంపేటలో వంటగ్యాస్ దందా
- వినియోగదారుల జేబులకు చిల్లులు
- సిలిండర్ ధర ఒకటైతే.. అదనపు వసూళ్లు మరోలా






**పెద్ద శంకరంపేట, ఆగస్టు 29 (జనంసాక్షి):** వంటగ్యాస్ సిలిండర్ అంటేనే సామాన్యుడి ఇంటి నెలవారీ ఖర్చులో కీలక భాగం. పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇప్పటికే సతమతమవుతున్న ప్రజలకు గ్యాస్ సిలిండర్ వ్యవహారంలో అదనపు భారం తప్పడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సిలిండర్ అందాల్సి ఉండగా, పంపిణీ సమయంలో అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ధర ఒకటైతే.. వసూలు మరోలా?**

గ్యాస్ సిలిండర్ ధరకు తోడు రవాణా, డెలివరీ పేరుతో అదనపు మొత్తాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. అధికారిక ధర ఎంత? వినియోగదారుడి నుంచి వాస్తవంగా ఎంత వసూలు చేస్తున్నారు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**పేదలపై అదనపు భారం...**

వంటగ్యాస్ ధర పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు అదనపు వసూళ్లు మరింత భారంగా మారుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ ఇంటి వద్దకు చేరే సమయానికి నిర్ణయించిన ధర కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

గ్యాస్ పంపిణీ వ్యవస్థపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తనిఖీలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వినియోగదారుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.

5 కిలోమీటర్ల రన్నింగ్‌లో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసిన క్రీడాకారులు, క్రీడాభిమానులలో స్ఫూర్తిని ఉత్సాహాన్ని మెదక్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్ నింపారు. జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్కమ్ బోర్డు చౌరస్తా నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు పురుషులకు ఐదు కిలోమీటర్ల రన్నింగ్, అలాగే మెదక్ కొత్త బస్టాండ్ నుండి ధ్యాన్చంద్ చౌరస్తా వరకు బాలికలకు రెండు కిలోమీటర్ల రన్నింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండాతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. మన మెదక్ జిల్లాలో జాతీయ క్రీడ దినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించుకోవడం శుభపరిణామం అని పేర్కొన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. క్రీడాకారుల విద్యార్థులు జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయిలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. . క్రీడలలో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడ లభిస్తాయి అన్నారు.

అనంతరం ధ్యాన్చంద్ చౌరస్తా వద్ద ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జుబేర్ అహ్మద్ , స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శివ,డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్, ,పాల్గొని ధ్యాన్చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులర్పించారు అనంతరం క్రీడాకారులు క్రీడాభిమాను ఉద్దేశించి వక్తలు తమ సందేశాలను వినిపించారు.విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, సమష్టి తత్వం పెంపొందించడమే లక్ష్యంగా పురుషులకు ఐదు కిలోమీటర్ల, బాలికలకు రెండు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదగా మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామ చంద్ర రాజు,మెదక్ జిల్లా పాఠశాల క్రీడా సమైక్య కార్యదర్శి నాగరాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం,ఫుట్బాల్ కోచ్ వినయ్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## మాఫియా మాయ.. గుట్టలు మాయం!

- కోహిర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఎర్రమట్టి తవ్వకాలు
- అధికారుల కళ్లెదుటే మట్టి దందా.. పట్టించుకోని యంత్రాంగం
- ప్రభుత్వ ఖజానాకు గండి.. పర్యావరణానికి పెనుముప్పు





**కోహిర్, ఆగస్టు 29 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో ఎర్రమట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని చింతలగట్టు, కొత్తూరు (డి) తదితర ప్రాంతాల్లో గుట్టలను యథేచ్ఛగా తవ్వుతూ మట్టిని ప్రైవేట్ వెంచర్లు, భవన నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు ప్రకృతి అందాలకు నిలయంగా ఉన్న గుట్టలు.. ప్రస్తుతం భారీ గుంతలుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పగలు.. రాత్రి.. మట్టి తవ్వకాలే!**

అనుమతులు, నిబంధనలకు సంబంధించి స్పష్టత లేకుండానే పెద్ద సంఖ్యలో టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా తవ్వకాలు, రవాణా కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మట్టిని ప్రైవేట్ వెంచర్లు, భవన నిర్మాణాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో టిప్పర్ మట్టిని వేలాది రూపాయలకు విక్రయిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

**గుట్టల స్థానంలో భారీ గుంతలు...**

మట్టి కోసం గుట్టలను సుమారు 20 నుంచి 50 అడుగుల లోతు వరకు తవ్వుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలు ప్రమాదకరంగా మారుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో భారీ గుంతల్లో నీరు చేరితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. విచ్చలవిడిగా తవ్వకాలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు భవిష్యత్‌లో భూసారంపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ భూములే టార్గెట్?**

ప్రభుత్వ భూముల్లో ఎకరాల కొద్దీ విస్తీర్ణంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. చింతలగట్టు, కొత్తూరు (డి)తో పాటు ఇతర ప్రాంతాల్లోనూ తవ్వకాలు విస్తరిస్తున్నాయని, ఇక్కడి నుంచి సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు మట్టిని తరలిస్తున్నారని స్థానికంగా సమాచారం వినిపిస్తోంది.

**'మామూలు'గా తీసుకుంటున్నారా?**

ఇంత బహిరంగంగా మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నప్పటికీ మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలు ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు అధికారుల పేరుతో **'మామూళ్లు'** చెల్లిస్తున్నారనే ప్రచారం ఉన్నప్పటికీ, దీనిపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి...**

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా కొనసాగితే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిబంధనల ప్రకారం సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్న తర్వాతే తవ్వకాలు, రవాణా చేపట్టాల్సి ఉండగా.. అనుమతులు లేకుండానే కార్యకలాపాలు కొనసాగుతున్నా యనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికార పార్టీ నేతల అండ ఉందా?**

మట్టి దందాకు కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. నెలవారీగా ముడుపులు చెల్లిస్తున్నారనే ప్రచారం సాగుతున్నప్పటికీ, ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత నాయకుల నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఆరోపణల్లో నిజానిజాలు తేలాలంటే మైనింగ్, రెవెన్యూ శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి...**

కోహిర్ మండలంలో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. గుట్టలు మాయమవుతున్నాయా? ప్రభుత్వ భూములు దెబ్బతింటున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా జరుగుతోందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పంచాయతీ కార్యాలయంలో దాడి కలకలం!

- తాళం చెవి వివాదం చినికి చినికి గాలివాన.. కార్యదర్శిపై కుర్చీతో దాడికి యత్నం ఆరోపణలు
- ప్రభుత్వ ఉద్యోగుల భద్రతపై ఉద్యోగ సంఘాల ఆగ్రహం.. బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్





**నారాయణఖేడ్, ఆగస్టు 29 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలం బీబీపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో తాళం చెవి విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శి నక్షత్రాల వెంకటరంగయ్యపై దాడికి యత్నించినట్లు ఆరోపణలు రావడం స్థానికంగా కలకలం రేపింది. కార్యాలయ తాళం చెవి విషయమై కార్యదర్శి, సర్పంచ్ భర్త సాయిలు మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో తనపై కుర్చీతో దాడికి యత్నించారని కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

**తాళం చెవి కోసం మొదలై.. ఉద్రిక్తతకు దారి**

పంచాయతీ కార్యాలయ తాళం చెవి విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం. దీంతో కార్యదర్శి పోలీసులను ఆశ్రయించి తనపై దాడికి యత్నించినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**కేసు నమోదు.. పోలీసుల దర్యాప్తు**

కార్యదర్శి ఫిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఘటన సమయంలో అక్కడ ఏం జరిగింది? దాడికి యత్నం జరిగిందా? వివాదానికి అసలు కారణమేంటి? అనే అంశాలపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

**ఉద్యోగ సంఘాల తీవ్ర ఆగ్రహం...**

విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి యత్నించారనే ఆరోపణలను పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించేలా అధికారులు రక్షణ కల్పించాలని కోరారు.

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కల్హేర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, సీఐలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ ఎక్కడ?**

గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందించే పంచాయతీ కార్యదర్శులు ఒత్తిళ్లు, వివాదాల మధ్య విధులు నిర్వహించాల్సి వస్తే పాలనపై ప్రభావం పడే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడులు, బెదిరింపులకు తావులేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు కోరారు.

బీబీపేట ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి అసలు నిజాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులు ఎవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# నిర్లక్ష్యం పట్టపగలే వెలుగుతుంది

- నియంత్రణ లేక వృధా అవుతున్న గ్రామపంచాయతీ సొమ్ము
- నిర్లక్ష్యపు వైఖరిలో పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు

**మొగుడంపల్లి,ఆగస్టు 29(జనంసాక్షి):** మండల పరిధిలోని ధనశ్రీ గ్రామంలో నెలకొల్పిన వీధిలైట్లు నిరంతరం రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిర్లక్ష్యం పట్టపగలే వెలుగుతున్న గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం దర్పనమిస్తుంది. అసలే గత రెండు సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీలలో నిధుల సమస్యతో సతమతమవుతున్న తరుణంలో ఇలా రాత్రి పగలు అనే తేడా లేకుండా నిరంతరం వీధిలైట్లు వెలగడం వలన గ్రామ పంచాయతీ సోము వృధా పాలవుతుంది. అన్ని గ్రామస్తులు ఆరోపించారు. వీధిలైట్లు ఏర్పాటు చేసిన నాటి నుండి నేటి వరకు కనీసం వీధిలైట్లను కనీసం ఆన్, ఆఫ్ చేసే విధానాన్ని అమలు చేయకపోవడంతో నిత్యం వీధిలైట్లు రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెలుగుతున్నాయని ఆ సందర్భంలో విద్యుత్ లైట్లు వెలగకుండా పూర్తిగా పనికిరాకుండా పోతాయని గ్రామస్తులు ఆరోపించారు. ఇలా నిత్యం వీధిలైట్లు వెలగడంతో కరెంట్ వృధా కావడమే కాకుండా ఆ భారం కాస్త గ్రామపంచాయతీ పైన పడుతుందని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లకు నియంత్రణ విధానాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ వృధా కాకుండా గ్రామపంచాయతీపై పడేటువంటి అదనపు సొమ్ము వృధా కాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తుల కోరారు.

## రెండు గంటల్లో వాహనం

# దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

- చాకచక్యంగా ద్విచక్ర వాహనం స్వాధీనం
- నారాయణఖేడ్ ఎస్ఐ రాసుల శ్రీశైలం



**నారాయణఖేడ్, ఆగస్టు 29 (జనంసాక్షి):** ద్విచక్ర వాహనం దొంగతనం జరిగిన రెండు గంటల్లోనే కేసును ఛేదించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మండలం పరిధిలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి హట్యా నాయక్ తండాకు చెందిన మేఘావత్ హన్మ నాయక్ తన హీరో ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనం (TS15 ET 9659)ను శుక్రవారం రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచాడు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో నారాయణఖేడ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు అందుకున్న నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం వెంటనే దర్యాప్తు చేపట్టి, సిబ్బందితో కలిసి చాకచక్యంగా వ్యవహరించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని సేకరించి దర్యాప్తు కొనసాగించగా, దొంగిలించబడిన వాహనం నారాయణఖేడ్ మండల పరిధిలోని జుకల్ శివారులో గల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించే చర్యలు చేపట్టారు. దొంగతనం జరిగిన కొద్ది గంటల్లోనే వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడంపై బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వాహన దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి ఉంచడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయంలో గంప జాతర



**మల్దకల్, ఆగస్టు 29 (జనంసాక్షి):** ఆది శిలాక్షేత్రం శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో దేవరగట్టుకు వెళ్లి పూజలు నిర్వహించి దశమికట్ట వరకు ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవ ద్వారా గంప జాతర నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాదరావు, ఈవో సత్య చంద్రారెడ్డి,ఆలయ అర్చకుడు జ్యోషి రవిచారి, చంద్రశేఖరరావు,రాము సుబ్బారెడ్డి,వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరము శ్రావణమాసంలో మూడవ శనివారం ఈ గంప జాతర జరుగుతుంది.

# పోతారంలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ



**తూప్రాన్ ఆగస్టు 29(జనంసాక్షి):** పోతారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సర్పంచ్ పుట్ట వినోద మహేందర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పుట్ట వినోద మహేందర్ అర్హులైన గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మన్నె సురేష్, చెలిమిల పవన్ గౌడ్, సంకి.శ్రీకాంత్, గ్రామ పెద్దలు వడ్ల సత్తయ్య, వడ్ల రాములు, బడికోల్ మల్లారెడ్డి, చెలిమల మల్లేష్ గౌడ్, పులి రమేష్ యాదవ్, పుట్ట కుమార్, బడికోల్ నరసింహారెడ్డి, బడికోల్ భూపాల్ రెడ్డి, తలారి ఆంజనేయులు, సంకి యాదగిరి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

# చేర్యాల మండల కేంద్రంలో ఘనంగా క్రీడా దినోత్సవం



**చేర్యాల, ఆగస్టు 29 (జనంసాక్షి):** చేర్యాల మండల స్థానిక పోలీస్ స్టేషన్ లో చేర్యాల పోలీస్ స్టేషన్ యూత్ ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి హాజరై క్రీడాకారులను, క్రీడా అభిమానులను అభినందించిన అనంతరం మాట్లాడుతూ... ఈ మధ్య కాలంలో యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు బానిసయి క్రీడలను మర్చిపోతున్నారని, అలాంటి సంస్కృతిని వదిలిపెట్టి క్రీడలపై దృష్టి సాధించాలని, మన చేర్యాల పోలీస్ స్టేషన్లో సుమారు రోజు 50 మంది పిల్లల యువత వాలీబాల్ ఆటను నేర్చుకోవడానికి వస్తున్నారని అన్నారు. పిల్లలు రోజు గ్రౌండ్‌కు రావడానికి కారణం పి.ఈటి తాడేం రమేష్ కారణం అని ఎస్ఐ కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువత పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాం దుస్తుల పంపిణీ





**గుమ్మడిదల, ఆగస్టు 29 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని ZPHS, MPPS ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫాం దుస్తులను శనివారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పెంటారెడ్డి, AAPC చైర్మన్ పూజ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పాషా, మహిళా వార్డు సభ్యులు శశికల, నాగరాణి, గ్రామ పెద్దలు, పాఠశాల హెచ్ఎం నీరజ, సీసీ వరలక్ష్మి, ఊాలు కల్పన, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తల్లునూర్‌లో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ

- ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికీ తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన సేవాదల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి నాయక్, బీజేపీ మండల అధ్యక్షులు బాలు నాయక్





**రేవల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి):** రేవల్లి మండల పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తల్లునూర్ తండాకు చెందిన రెడ్యా నాయక్ తండా నుండి తల్లునూర్ వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, తల్లునూర్ గ్రామం నుండి తండా వైపు వస్తున్న రోహిత్, రాహుల్ ల బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రోహిత్‌కు రెండు పక్కటెముకలు, కుడికాలు విరిగిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన రెడ్యానాయక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. క్షతగాత్రులను ముందుగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సేవాదల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి నాయక్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి, ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఎన్నికల ముందు హామీలు - నెగ్గినక ఎగ్గొట్టారు

- 13 కోట్లతో పనులు సాంక్షన్
- ప్రమాదాలు జరిగిన పట్టవా?
- ఆరు గ్యారంటీలు ఎక్కడ?
- నందగోకుల్ - చల్మెడ రోడ్డు పనులు చేపట్టకుంటే నిరసన దీక్షలు
- మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి..





**నిజాంపేట, ఆగస్టు 29 (జనంసాక్షి):** గత రెండున్నర ఏళ్లుగా కంకర రోడ్డులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని, రోడ్డు బాగా లేకపోవడంతో ఆ గ్రామాలకు బస్సు సౌకర్యానికి కూడా నోచుకోలేకపోతున్నయన్నారు. రోడ్డు పనులు చేపట్టకుంటే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం నిజాంపేట మండలం నందగోకుల్ - చల్మెడ కమాన్ వరకు సుమారు 8 కిలోమీటర్ల వరకు కంకర రోడ్డు పై మాజీ ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి, శశిధర్ రెడ్డితో కలసి పాదయాత్ర చేపట్టారు. వారం రోజుల్లో ఈ రోడ్డు పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..** ఎన్నికల ముందు నెరవేరని హామీలు ఎన్నో ఇచ్చి, నెగ్గినాక పూర్తిగా విస్మరిస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సాంక్షన్ చేసిన రోడ్లను సైతం పూర్తిచేసే దిక్కులేదన్నారు. నిజాంపేట, నస్కల్, నందగోకుల్, చల్మెడ కమాన్ వరకు 14 కిలోమీటర్ల రోడ్డు 13 కోట్లతో సాంక్షన్ చేయగా, పనులు చేపట్టకపోవడంతో నస్కల్ గ్రామస్తులు నిజాంపేటలో నిరసన దీక్షలు 11 రోజులపాటు కొనసాగగా నిజాంపేట, నస్కల్ రోడ్డుపై తారు వేశారన్నారు. కానీ చల్మెడ కమాన్, నంద గోకుల్ వరకు సుమారు 7 కిలోమీటర్లు 10 కోట్ల పనులు ప్రారంభించకపోవడం సిగ్గుచేటు అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేకు ఈ రోడ్డుపై ప్రజలు పడుతున్న ఇబ్బందులు పట్టడం లేదా! అని ప్రశ్నించారు. ప్రజల ముందు కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు అంటున్నారు కానీ, ప్రభుత్వం డబ్బులు ఇవ్వంది. కాంట్రాక్టర్ పనులు ఎక్కడ? చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు, అగ్గిలో కలిసాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల వరకే పరిమితమయ్యారన్నారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయన్నారు. మళ్ళీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయన్నారు. వారంలో రోడ్డు పనులు ప్రారంభించకుంటె ప్రజలతో నిరసన దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చౌదరి చరిత, లావణ్య రెడ్డి, మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నంద్యాల బాల్ రెడ్డి, బజార్ రంజిత్ గౌడ్, కిష్టా గౌడ్, బిజ్జా సంపత్, ఎండీ అబ్దులు అజిత్, నగేష్, వెంకట్ స్వామి గౌడ్, బాల్ నర్సవ్వ, ఉడెపు రాజయ్య గ్రామాల ప్రజలు ఉన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రం



**జగదేవ్ పూర్ ఆగస్టు 29 (జనంసాక్షి):** గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రం అన్నారు. శనివారం జగదేవ్ పూర్ మండలం తిగుల్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కోసం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 17 గ్రంథాలయాలు ఉన్నట్లు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో 17 గ్రంథాలయాలు ఉన్నప్పటికీ సిబ్బంది ఏడుగురు మాత్రమే ఉన్నారని 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఖాళీల భర్తీ కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు వివరించారు. తిగుల్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కోసం భవనం సిద్దంగా ఉందని త్వరలోనే ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారలని విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా ఉదయం సాయంత్రం గ్రంథాలయాలకు వెళ్లి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చదవాలని సూచించారు. అలాగే చరిత్ర గల పుస్తకాలను చదవితే ప్రతి ఒక్కరికి విజ్ఞానం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ భూమయ్య, మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు, సిపిఐ నాయకులు దయానంద రెడ్డి, గ్రామ నాయకులు కరుణాకర్ రెడ్డి, పరశురామ్, జంగని ఐలయ్య, మనోజ్, చింటూ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కొప్పుల్ ఆలయంలో శ్రావణమాస ప్రత్యేక పూజలు



**పెద్ద శంకరంపేట, ఆగస్టు 29 (జనంసాక్షి):** శ్రావణమాసం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పుల్ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని కోనేటిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వయంభు లింగంగా వెలసిన ఉమా సంగమేశ్వర స్వామిని దర్శించుకుని వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక అభిషేకాలు పూజలు భక్తుడు నిర్వహించారు. భక్తులందరికీ పెద్ద శంకరంపేటకు చెందిన కందుకూరి రవీందర్ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అంకితభావంతో చదివితే అసాధ్యం ఏమీ లేదని నిరూపించిన విద్యార్థిని

- ప్రోత్సహించిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



**చేర్యాల, ఆగస్టు 29 (జనంసాక్షి):** అంకితభావంతో చదివితే సాధించ లేనిది ఏమీ లేదని నిరూపించారు జడ్పీహెచ్ఎస్ వేచరేణి పాఠశాల విద్యార్థిని. గత మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన పదవ తరగతి ఎస్ఎస్సీ ఫలితాల్లో సాంఘిక శాస్త్రంలో బూరు సంజన 100 కి 100 మార్కులు సాధించి పాఠశాలకు, మండలానికి పేరు తీసుకొచ్చింది. విద్యార్థిని ఈ ఘనత సాధించడం వెనుక విశేష కృషి చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పెరక రాజయ్యను సోషల్ ఫోరం తరపున ఘనంగా సన్మానించారు. శనివారం ఉన్నత పాఠశాల ఆకునూరు కాంప్లెక్స్ సమావేశంలో చేర్యాల, మద్దూర్ మండలాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, సోషల్ ఫోరం సభ్యులు కలిసి ఉపాధ్యాయుడు పెరక రాజయ్యను శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థులను ఇదే స్ఫూర్తితో చదివించి మరిన్ని విజయాలు సాధించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## క్రీడా స్ఫూర్తితో కదిలిన సదాశివపేట

- 600 మందికీ పైగా విద్యార్థులతో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**సంగారెడ్డి, ఆగస్టు 29(జనంసాక్షి):** మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సదాశివపేటలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మ గుడి నుంచి గాంధీచౌక్ మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వరకు నిర్వహించిన క్రీడా ర్యాలీలో 600 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఒలింపిక్ టార్చ్‌లు, బ్యాండ్ మేళాలు, పాఠశాలల బ్యానర్లతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

కార్యక్రమానికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, మున్సిపల్ కమిషనర్ శివాజీ ముఖ్య అతిథులుగా హాజరై శాంతి కపోతాలను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని వారు సూచించారు.

అండర్-17 బాలికల 4×100 మీటర్ల రిలేలో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థినులు శివాని, ఇందు, ప్రవళిక, స్రవంతి ప్రథమ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల బాలికల పరుగు పందెంలో శివాని విజేతగా నిలిచారు. బాలుర విభాగంలో ప్రకాష్ మొదటి స్థానాన్ని సాధించాడు. విజేతలకు నగదు బహుమతులు, పతకాలు అందజేశారు.

విద్యార్థులకు ఉచిత క్రీడా శిక్షణ అందిస్తున్న ముజీబ్ మన్సూర్ మాస్టర్‌ను ముఖ్య అతిథులు అభినందించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడు నాగుల విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కో-ఆప్షన సభ్యులు రహమత్, శంకర్ గౌడ్, రామకృష్ణారెడ్డి మన్సూర్ అహ్మద్ , విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో భక్తుల ప్రత్యేక పూజలు



**శివ్వంపేట, ఆగస్ట్ 29 (జనంసాక్షి):** శ్రావణమాసం మూడవ శనివారన్ని పరిష్కరించుకొని శివ్వంపేట మండలం చిన్నగొట్టి ముక్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి దేవాలయానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు జంట నగరాల నుంచి తరలివచ్చిన భక్తులు దేవాలయంలో ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా భక్తులు, ప్రముఖులు ఆంజనేయస్వామి వారికీ చందన పూజ, అభిషేకం, అర్చన, మన్యాసుక్త పారాయణం, బిల్వ దళర్చన, ఆకుపూజా, పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో దంపతుల వారీగా పెద్ద సంఖ్యలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించి, వారి మొక్కులు తీర్చుకున్నారు. ఆ తర్వాత రామ మందిరంలో స్వామివారి దర్శించుకొని భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఆంజనేయశర్మ,పూజారులు శాస్త్రుల దేవాదత్తు శర్మ, దేవి ప్రసాద్ శర్మ, శ్రీ హర్షశర్మ, సిబ్బంది రామ కృష్ణలతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- PLAY FOR LIFE రూపంలో విద్యార్థుల వినూత్న సందేశం



**కేటీదొడ్డి, ఆగష్టు 29 (జనంసాక్షి):** పీఎం శ్రీ ఎంపిహెచ్ఎస్ కుచినేర్ల పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వినూత్నంగా క్రీడల ప్రాముఖ్యతను చాటారు.

పాఠశాల మైదానంలో విద్యార్థులందరూ క్రమశిక్షణతో కూర్చుని మానవహారంగా ఏర్పడి "PLAY FOR LIFE" అనే అక్షరాల రూపంలో ప్రదర్శన ఇవ్వడం జరిగింది.

**ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ...** నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు కేవలం పుస్తకాలకే, మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా నిత్యం మైదానంలో ఆటలు ఆడటం ద్వారా శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. క్రీడలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను, ఐక్యతను, ఓటమిని సైతం స్వీకరించే క్రీడాస్ఫూర్తిని నేర్పుతాయని పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పరుగు పందాలు, కబడ్డీ, ఖో-ఖో మరియు సరదా ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శివకృష్ణ, ఉపాధ్యాయులు గోపీనాథ్ గౌడ్, రాజశేఖర్, అసిమా బేగం, నాజియా బేగం, అశ్విని, ఎస్తేర్ రాణి, నరేష్, అమ్రేష్, రంగప్ప, నర్సింహ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతులతో అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు

- యశోద హాస్పిటల్స్‌లో అధునాతన సర్జరీలు, సమగ్ర క్యాన్సర్ కేర్
- క్యాన్సర్ వ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ యుగేందర్ రెడ్డి

**సంగారెడ్డి ఆగస్టు 29 (జనంసాక్షి):** క్యాన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య సదుపాయాలతో, తక్కువ కోతలతో కూడిన మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతుల్లో ఖచ్చితమైన చికిత్స అందిస్తున్నట్లు సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజీ, లాపరోస్కోపిక్ అండ్ రోబోటిక్ ఆంకో-సర్జన్ డాక్టర్ వై.యుగంధర్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని రెడ్ల సీన్ ఓటర్స్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ చికిత్సలో లాపరోస్కోపిక్, రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీలు కీలకంగా మారుతున్నా యని తెలిపారు. చిన్న కోతలతోనే క్లిష్టమైన శస్త్ర చికిత్సలను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించే అవకాశం ఈ విధానాల ద్వారా లభిస్తుందన్నారు.




గ్యాస్ట్రోఇంటెస్టినల్, కొలొరెక్టల్, బ్రెస్ట్, గైనకాలజికల్ తదితర క్యాన్సర్ల చికిత్సలో ఆధునిక సర్జికల్ పద్ధతులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ కణితిని తొలగించడంతో పాటు సాధ్యమైనంత వరకు ఆరోగ్యకరమైన కణజాలాన్ని కాపాడటం, రోగులు త్వరగా కోలుకునేలా చూడటం తమ ప్రధాన లక్ష్యమన్నారు. యశోద హాస్పిటల్స్‌లో సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ నిపుణులు సమన్వయంతో పనిచేస్తూ రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా సమగ్ర చికిత్సా విధానాన్ని రూపొందిస్తున్నారని డాక్టర్ యుగంధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ మేనేజర్ సంజీవ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో రక్షబంధన్..

- అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా రాఖీ పౌర్ణమి..





**మహమ్మదాబాద్, ఆగస్టు 29 (జనంసాక్షి):** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు మహమ్మదాబాద్ మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని, సోదరులు, సోదరీ మణులు పరస్పరం రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గాదిర్యాల్ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం, ఆధ్వర్యంలో గాదిర్యాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జి.చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్, బి.రామకృష్ణ, ఎన్.కృష్ణయ్య, టి.రాములు, జి.హన్మంత్, ఉపాధ్యాయులు విద్యార్థులు, శ్రీ ప్రైమరీ పాఠశాల టీచర్ మౌనిక పాల్గొన్నారు.

# 26వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

- 155వ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల వివరాల పరిశీలన

**మెదక్ టౌన్, ఆగస్టు 29 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని 26వ వార్డు పరిధిలోని 155వ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయిలో ఓటర్ల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి హాజరై తమ పేరు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు తదితర అంశాలను పరిశీలించుకుంటున్నారు. వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు అవసరమైన సమాచారం అందిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారి మాధవి, బూత్‌స్థాయి ప్రతినిధులు సాయిరాజ్, సాబీర్ పాషా, వార్డు అధికారులు వెన్నెల, అరుణ్ పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పర్యవేక్షించారు. అదే విధంగా GPO ఎలక్షన్ సూపర్వైజర్ వీ.స్వామి, వీణ. అక్బర్ అలీ ఈ కార్యక్రమాన్ని పరిశీలించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తీరును పర్యవేక్షించారు. ఓటర్ల నుంచి అవసరమైన వివరాలను స్వీకరిస్తూ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, పేరు లేదా చిరునామాలో తప్పులు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి నిర్ణీత సమయంలో సవరణ చేసుకోవాలని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు అని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు సహకరించాలని కోరారు. 26వ వార్డు పరిధిలోని 155వ పోలింగ్ కేంద్రానికి ఓటర్లు హాజరై తమ వివరాలను పరిశీలించుకుంటుండటంతో కేంద్రం వద్ద సందడి నెలకొంది. అధికారులు, బూత్‌స్థాయి ప్రతినిధులు,వార్డు సిబ్బంది సమన్వయంతో సవరణ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.





# విద్యార్థులకు షూస్ పంపిణీ చేసిన సర్పంచ్



**మల్దకల్, ఆగస్టు 29(జనంసాక్షి):** మండల పరిధిలోని నాగర్‌దొడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారుల సంక్షేమం విద్యా వికాసమే లక్ష్యంగా శనివారం విద్యార్థులకు గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ఉచితంగా షూస్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటేశ్వరమ్మ సత్యన్న, ఉపసర్పంచ్ జార్జి, వార్డు మెంబర్ రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ మహేష్, గ్రామ పెద్దలు జిన్ను హనుమంతు, మోహన్ గౌడ్, కుమ్మరి శ్రీరాములు, కే.రాముడు, శేఖర్, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల సృజనాత్మకత, శారీరక ఎదుగుదలపై అవగాహన



**కల్వకుర్తి, ఆగస్ట్ 29 (జనంసాక్షి):** మండలంలోని రాచలపల్లి గ్రామంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 1, 2వ తరగతుల విద్యార్థులు, వారి తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు జ్ఞానాన్ని పెంపొందించడం, తల్లులు పిల్లలతో అనుబంధాన్ని పెంచుకోవడం, డ్రాయింగ్ వంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల శారీరక ఎదుగుదలకు ఆటలు ఎంతో అవసరమని, స్థూల, సూక్ష్మ కండరాల అభివృద్ధికి ఆటలు దోహదపడతాయని వివరించారు. అలాగే 3 నుంచి 5వ తరగతులు, 6 నుంచి 8వ తరగతుల విద్యార్థులను కమ్యూనిటీ క్లబ్‌లుగా ఏర్పాటు చేసి వాలంటీర్ల సహకారంతో చదువుకునే విధానంపై కూడా అవగాహన కల్పించినట్లు మండల కో-ఆర్డినేటర్ నజీమా బేగం తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగ్గయ్య, ప్రథమ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ పర్వతాలు, మండల కో-ఆర్డినేటర్ నజీమా బేగం, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# నంగునూర్ మండల కేంద్రంలో పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు



**నంగునూరు, ఆగస్టు 29(జనంసాక్షి):** నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు నంగునూర్ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. నంగునూరు మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బాణాసంచా పేల్చారు. పూజల హరికృష్ణకు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజల కోసం పనిచేసే నాయకున్ని ఎన్నుకోండి

- ఇంట్లో కూర్చొని రాజకీయం చేసేవారికి పదవి ఇవ్వవద్దు
- పకడ్బందీగా మండల నాయకులను ఎన్నుకోండి
- పార్టీ నాయకులు మీటింగ్‌కు గైర్హాజరు: జగ్గారెడ్డి ఆగ్రహం





**సంగారెడ్డి, ఆగస్టు 29 (జనంసాక్షి):** ప్రజల కోసం పనిచేసే నాయకుని ఎన్నుకొని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట ను నిలబెట్టే నాయకులను మండల కమిటీ కాంగ్రెస్ నాయకులను ఎన్నుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పట్టణ కమిటీ చైర్మన్ లకు బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ లకు సూచించారు లిస్టులో పేరు ఉండి సమావేశానికి గైరాజర్ వ్యక్తులను తొలగించి ప్రజల కోసం పనిచేసే నాయకున్ని ఎన్నుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు శనివారం సంగారెడ్డి పట్టణంలో క్లాసిక్ గార్డెన్ లో సంగారెడ్డి నియోజకవర్గ,కాంగ్రెస్ పార్టీ సదాశివపేట ,సంగారెడ్డి పట్టణాలు 4 మండలాలు కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకుల సమావేశం నిర్వహించారు ఈ సమావే శంలో టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసిసి అధ్యక్షులు ఆదేశాల మేరకు సంగారెడ్డి నియోజకవర్గంలోని రెండు పట్టణాలు నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకుల సమావేశం నిర్వహించామని అన్నారు. ఈ సమావేశానికి కమిటీలో ఉన్న వ్యక్తులు గైరాజా కావడంతో ఆగ్రహ వ్యక్తం చేశారు. వచ్చేనెల ఐదున సమావేశం ఉంటుందని అన్నారు ఈ సమావేశానికి తప్పనిసరిగా అందరూ హాజరు కావాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ కోసం పనిచేసే నాయకులను కమిటీలో ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

జగ్గారెడ్డి నిర్మల జగ్గారెడ్డి దంపతుల కుమారుడి భరత్ సాయి రెడ్డి ఎంగేజ్మెంట్ ఫంక్షన్‌కి మీద పార్టీ నాయకులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిత్రులు అధికారులు అన అధికారులు సరిగా రావాలని ఆహ్వానం పలికారు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులు, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కిరణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మండల కమిటీ చైర్మన్ నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికలు



మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి): గ్రామాల స్థానిక అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సద్విని యోగం చేసుకుంటూ సమగ్ర అభివృద్ధికి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు (VGPP) పకడ్బందీగా రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో VGPPపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాలతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.

ప్రతి చుక్క వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ఫార్మ్ పాండ్స్, ట్రెంచ్‌లు, సోక్‌పిట్స్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, వాటర్ హార్వెస్టింగ్ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఫార్మ్ పాండ్స్ వల్ల భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్‌లో పంటలకు నీటి లభ్యత మెరుగుపడే ప్రయోజనాలను రైతులకు వివరించి వారిని ప్రోత్సహించాలని అన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలకు సూచించారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి సర్పంచులు, ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తక్కువ లేబర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, కూలి చెల్లింపులపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాను అన్ని అభివృద్ధి సూచీల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని మధుసూదన్ నాయక్ కోరారు. DRDO నరసింహులు, వివిధ శాఖల అధికారులు తమ పథకాలు, పనులను VGPPలో పొందుపరచాలని సూచించారు.

# ఏ.ఎస్సై కన్నయ్యకు పోలీసు అధికారిక లాంఛనాలతో ఘన అంతిమ వీడ్కోలు

గద్వాల నడిగడ్డ, ఆగస్టు 29(జనంసాక్షి); జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ఇటీవల దైవ దర్శనానికి తిరుపతి వెళ్లి మెట్లమార్గంలో కొండ ఎక్కుతూ హార్ట్ ఎటాక్‌తో మృతిచెందిన ఏ.ఎస్సై కన్నయ్య అంత్యక్రియలు శనివారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసు అధికారిక లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు.





జిల్లా పోలీసు శాఖ తరఫున పోలీసు అధికారులు, సిబ్బంది కన్నయ్య గారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు గౌరవ వందనంతో పాటు అధికారిక లాంఛనాలు నిర్వహించిన ఏ.ఎస్సై కన్నయ్యకి అంతిమ వీడ్కోలు పలికారు.

సుదీర్ఘకాలం పోలీసు శాఖకు అంకితభావంతో సేవలందించిన కన్నయ్య సేవలను ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సహచర సిబ్బంది స్మరించుకున్నారు. ఆయన మృతి జిల్లా పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొంటూ, కన్నయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మేడికొండలో జాతీయ క్రీడా దినోత్సవం



అయిజ, ఆగస్టు 28 (జనంసాక్షి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అయిజ మండల స్థాయి క్రీడా పోటీలు, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్పీహెచ్ ఎస్ మెడికొండలో అయిజ మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డి ఈ ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ, “చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల జీవితంలో ఎంతో ముఖ్యమైనవి. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించి, ప్రతిరోజూ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. చదువుతో పాటు క్రీడలు తప్పనిసరిగా ఉండాలి” అని అన్నారు.

మండల స్థాయిలో 17 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ ఒలింపిక్ పతాకాన్ని విజయలక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరణ క్రీడా వందనం ఒలింపిక్ టార్చ్ ప్రదర్శన, క్రీడా జ్యోతి వెలిగింపు క్రీడా పోటీల ప్రారంభోత్సవం. ఈ కార్యక్రమానికి దయాల్ రాములు,, శ్రీమతి లైజమ్మ, సర్పంచ్, శ్రీమతి రాధా తిమ్మప్ప, ఉప సర్పంచ్, శ్రీ సోమశేఖర్ రెడ్డి, ఉత్తనూర్, శ్రీమతి ఉషారాణి, పులికల్, శ్రీ శ్రీనివాసులు, జోగులాంబ గద్వాల్ జిల్లా కార్యదర్శి, జగదీష్, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు హాజరయ్యారు.

# జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం



మక్తల్, ఆగస్టు 29 (జనంసాక్షి): హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ 121వ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సత్యసాయి మందిరంలో ప్రతిభా పురస్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాతీయ స్థాయి సైక్లింగ్, షూటింగ్ బాల్ పోటీల్లో రాణించిన క్రీడాకారులను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటీ బి.గోపాలం శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బి.గోపాలం మాట్లాడుతూ 1905 ఆగస్టు 29న అలహాబాద్‌లో జన్మించిన ధ్యాన్‌చంద్, భారత ఆర్మీలో చేరి 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో వరుసగా మూడు బంగారు పతకాలు సాధించి భారత హాకీకి స్వర్ణ యుగం అందించారని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో 185 మ్యాచ్‌ల్లో 570 గోల్స్ సాధించి ‘ది విజార్డ్’, ‘ది మ్యాజిక్ ఆఫ్ హాకీ’గా ప్రసిద్ధి చెందారని, భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో గౌరవించిందని గుర్తుచేశారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జాతీయస్థాయి సైక్లింగ్ క్రీడాకారులు అనుష, హేమలత, త్రివేణి, అఖిల, స్వాతి, దీక్ష, తేజశ్రీ, శివాని, ప్రవీణ, దివ్య, నందిని, శ్రావణి, స్వప్న తదితరులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ డాక్టర్ మణికంఠ గౌడ్, ఉపాధ్యక్షుడు జి.శివకుమార్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఆడమ్స్, రాష్ట్ర కన్స్యూమర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజ్, నరేష్ గౌడ్, పీఈటీలు స్వప్న, అవంతి, తల్లిదండ్రులు నాగమణి, మేకల అంజి, నీళ్ల యాదగిరితో పాటు సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్యా, వైద్యం, ఉపాధి కల్పనకు పోరాడుదాం: ఏఐవైఎఫ్

- రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లు విడుదల




చేర్యాల, ఆగస్టు 29 (జనంసాక్షి): విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం యువత పోరాడాలని ఏఐవైఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల వాల్ పోస్టర్లను శనివారం చేర్యాల పట్టణంలోని సంఘం కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు శాశ్వత ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై స్పష్టమైన హామీలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గూడెపు సుదర్శన్, మండల అధ్యక్షులు కాశబోయిన చరణ్, మండల ప్రధాన కార్యదర్శి బోడపట్ల రాజు, ఉపాధ్యక్షులు బాపు అక్షయ్, గిద్దెల రాజు, తుడూమ్ నర్సింగరావు, బాలకృష్ణ, లింగం, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి ఆలయంలో కేశం నాగరాజు గౌడ్ ప్రత్యేక పూజలు





అమరచింత, ఆగస్టు 29 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య, క్రీడలు మరియు యువజన శాఖ, మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా మండల కేంద్రంలోని నందిమల ఎక్స్‌రోడ్డు శ్రీ ఆంజనేయ స్వామి తెలంగాణ రాష్ట్ర టాడి టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ ఆయన దేవాలయం వద్ద సప్తాంగం కార్యక్రమంలో పాల్గొని ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.సి.సి. వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు టి.రవికాంత్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హనుమంతు నాయక్ నందిమల్ల ఎక్స్ రోడ్ సర్పంచ్ విజయభారతి రాము ఉప సర్పంచ్ భాస్కర్ ఈర్లదిన్నె గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి వార్డు నంబర్స్ చుక్క కృష్ణ వర్ధన్, చంద్ర గట్టు గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్ నాగల్ కడుమూర్ గ్రామ అధ్యక్షుడు జగన్ రెడ్డి ,పి రామ్ రెడ్డి , ప్రభాకర్ , ఆనంద్ రాజు, దయానంద్ కె. కృష్ణ బి. కృష్ణ రామ్ రెడ్డి నల్ రెడ్డి నరసింహ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు.రవి కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోషల్ మీడియా కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

- బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్
- బకాయిల విడుదల కోసం బీజేవైఎం నిరాహార దీక్ష




నారాయణపేట, ఆగస్టు 29(జనంసాక్షి): విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు అని వెంటనే ఫీజు బకాయి, స్కాలర్ షిప్లు చెల్లించాలని నారాయణపేట జిల్లా బిజెపి అధ్యక్షుడు కొండా సత్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్ లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలనీ బి జె వై ఎం జిల్లా అధ్యక్షుడు భరత్ కోరారు. తెలంగాణ ప్రభు త్వం పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ భార తీయ జనతా యువమో ర్చా నారాయణపేట జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్ర మం నిర్వహించారు.

విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్యక్రమంలో నాయకులు ప్రస్తావించారు. ప్రభుత్వం బకాయిల విడుదలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థుల సమస్యలపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, ఫీజు రీయింబ ర్స్‌మెంట్ బకాయిల అంశంపై నాయకులతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో బీజేవైఎం పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు, మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేస్తాం

- **అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 29 (జనం సాక్షి):**
ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో భాగంగా జిల్లాలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,36,590 నోటీసులు జనరేట్ కాగా, 60,959 నోటీసులను ఓటర్లకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.
శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ERO\T, AEROలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి SIR ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేసి, సరైన ఎకనాలెజ్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. నోటీసు అందుకున్న వారికి అవసరమైన పత్రాలు సమర్పించేందుకు కనీసం ఏడు రోజుల గడువు ఇవ్వాలని, విచారణకు రెండు రోజుల ముందే సమాచారం అందించాలని ఆదేశించారు.
ఓటర్ల సౌకర్యార్థం విచారణలను పోలింగ్ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు లేదా ఇతర అనువైన ప్రదేశాల్లో వికేంద్రీకృత విధానంలో నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు EROలు, AEROలు రోజువారీ లక్ష్యాలతో కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు.
ఓటరు పేరు తొలగింపు లేదా మార్పులకు సంబంధించిన నిర్ణయాలను స్పష్టమైన కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్ల రూపంలో జారీ చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీలో పొరపాట్లు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, క్లెయిమ్స్, అభ్యంతరాల వివరాలను క్రమం తప్పకుండా ప్రదర్శించాలని సూచించారు.




SIRలో నోటీసుల జారీ నుంచి విచారణ, పత్రాల పరిశీలన, తుది నిర్ణయం వరకు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలని CEO స్పష్టం చేశారు.

## లారీని ఢీకొట్టిన డీసీఎం..మితిమీరిన వేగమే కారణమా?



**జోగులాంబ గద్వాల,ఆగస్టు 29(జనంసాక్షి):** జిల్లాలోని ఎర్రవల్లి మండల పరిధిలో గల బీచుపల్లి దేవస్థానం సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కర్నూలు వైపు నుంచి హైదరాబాద్ మార్గంలో వెళ్తున్న ఒక లారీ మలుపు తిరుగుతుండగా, అదే దిశలో వెనుక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన డీసీఎం వ్యాన్ సదరు లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాద తీవ్రతకు డీసీఎం ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయిపోయింది.ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోగా, స్థానికులు, ప్రయాణికులు ఎంతో శ్రమించి అతనిని బయటకు తీశారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలవ్వడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. క్షతగాత్రుడిని తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధ్యతారాహిత్యమే శాపంగా మారుతోంది:ఈ ప్రమాద ఘటన వాహనదారుల బాధ్యతారాహిత్యాన్ని మరోసారి స్పష్టం చేస్తోంది. జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు కనీస వేగ పరిమితులు పాటించకపోవడం, ముందు వెళ్తున్న వాహనాలకు, తమ వాహనానికి మధ్య సురక్షిత దూరాన్ని పాటించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతమవుతున్నాయి. ముఖ్యంగా మలుపులు, జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించాలనే కనీస ట్రాఫిక్ నియమాలను డ్రైవర్లు విస్మరిస్తున్నారు. నిద్రమత్తు, మితిమీరిన వేగం, రహదారిపై ఏకాగ్రత లోపించడం వంటి నిర్లక్ష్యపు చర్యలు కేవలం తమ ప్రాణాలకే కాకుండా, తోటి ప్రయాణికుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతున్నాయి. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ఇలాంటి ప్రమాదాలను అరికట్టడం సాధ్యమవుతుంది.

## తిరుమలాపూర్‌లో సవరణ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్



**రాజాపూర్, ఆగస్టు 28(జనంసాక్షీ):** SIRలో ఓటరు పేరు కానీ, తండ్రి పేరు గాని, చిరునామా లేదా ఇతర వివరములు ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకోవాలని రాజాపూర్ మండల తహసిల్దార్ రాధాకృష్ణ అన్నారు. శనివారం రాజాపూర్ మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ మంజుల, గ్రామ సర్పంచ్ బంగారి సంతోష వెంకటేష్ ఆర్ఐ మంజుల పంచాయతీ కార్యదర్శి భరత్ కుమార్, డిప్యూటీ సర్పంచ్ రామ్ చందర్, జీపీఓ శివ లింగం బిఎల్ఎ, బిఎల్ఓలు శ్యమల, లలిత వార్డ్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, రహిమత్, సత్యనారాయణ , నర్సిములు, చంద్రయ్య వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతాన కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**రేవల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి):** రేవల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ బోర్ల బీమయ్య సోదరుడి కుమార్తె కుమారి ప్రశాంతి ప్రతాన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వివాహవేడుకకు వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధువును ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో రేవల్లి మండల నాయకులు మాజీ జడ్పీటీసీ బీమయ్య, గ్రామ ఉపసర్పంచ్ సుధాకర్ రెడ్డి, శివరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రయ్య, కురుమతి రెడ్డి, ఉత్తమ్ రెడ్డి, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, ప్రతాప్ రెడ్డి, రేవల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కొత్త బండరాయిపాకుల ఎస్సీ కాలనీలో రెండేళ్లుగా కరెంటు కష్టాలు

- **బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ ఆగ్రహం**

**రేవల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి):**



రేవల్లి మండలం కొత్త బండరాయిపాకుల గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత రెండు సంవత్సరాల క్రితం కరెంటు స్తంభాలు నిలబెట్టినా, వాటికి వైరింగ్ చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని బహుజన్ సమాజ్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు మిద్దె మహేష్ తీవ్రంగా ఖండించారు.
ఊరిలో అన్ని లైన్లు క్లియర్ చేసి, కేవలం ఎస్సీ కాలనీలోనే కరెంటు లైన్ క్లియర్ చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని అధికారులను ప్రశ్నిస్తున్నామని ఆయన అన్నారు. రాత్రి సమయాల్లో గ్రామంలోకి పాములు వస్తున్నాయని, వానాకాలంలో కరెంటు వైర్లు తెగి కరెంటు లేక చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## గౌరిదేవిపల్లిలో ఏటీఎంఏ ఆధ్వర్యంలో పీఎస్‌బీ, నానో యూరియాపై అవగాహన

**రేవల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి):** రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లి గ్రామంలో ఏటీఎంఏ ఆధ్వర్యంలో పీఎస్‌బీ (ఫోస్ఫేట్ సొల్యూబిలిజింగ్ బాక్టీరియా) బయో ఫెర్టిలైజర్, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం, క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.
ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మణిచందర్ మాట్లాడుతూ పీఎస్‌బీ బయోఫెర్టిలైజర్ల వినియోగం ద్వారా నేలలో మొక్కలకు అందుబాటులో లేని భాస్వరం అందుబాటులోకి వచ్చి పంట ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే నానో యూరియాను శాస్త్రీయంగా, సిఫార్సు చేసిన మోతాదులో వినియోగించడం ద్వారా నత్రజని వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వివరించారు. అనంతరం రైతులకు బయోఫెర్టిలైజర్లు, నానో యూరియా వినియోగ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. రైతులు శాస్త్రీయ ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ పంట దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తిరుపతయ్య, సర్పంచ్ సురేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారిణి శిల్ప, ఉప సర్పంచ్ ఈర్ల వెంకటయ్య, బీఎఫ్ఏసీ సభ్యులు శ్రీ నారాయణ రెడ్డితో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.



## బోనాల ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదు

- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్సై కురుమూర్తి**



**కల్వకుర్తి, ఆగస్టు 29 (జనంసాక్షి):** బోనాల పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపుల్లో డీజేలను వినియోగిస్తే కఠినచర్యలు తప్పవని కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు.
డీజేలను వినియోగిస్తే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.
గత ఏడాది బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినట్లు ఎస్సై తెలిపారు. ఇకపై ఎలాంటి గొడవలకు పాల్పడకుండా హెచ్చరించి, తహసీల్దార్ సమక్షంలో ఒక్కొక్కరిని రూ.లక్ష చొప్పున బైండ్‌ఓవర్ చేసినట్లు పేర్కొన్నారు. బోనాల ఊరేగింపుల నిర్వాహకులు తమ తమ ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో రాత్రి 8 గంటలలోపు పూర్తి చేసుకోవాలని ఎస్సై సూచించారు. ఊరేగింపుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా అందుకు నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు.నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు. బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

# నేడు శ్రీ పంచమసిద్ధ లింగ మహా స్వాముల వారి జన్మదినం



**మాగనూర్, (జనంసాక్షి):** మాగనూరు మండలం నేరడగం గ్రామంలో శ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామీజీ వారి 36వ జన్మదిన మహోత్సవం సందర్భంగా ఈ నెల 30వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామీజీ వారి 36వ జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తి సంగీత సమర్పణ కార్యక్రమం నిర్వ హించనున్నట్లు శ్రీ పక్షిమాద్రి సంస్థాన విరక్త మఠం యువక మండలి, నేరడగం వారు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులు, రాజకీయ నాయ కులు, భక్తులు స్వామీజీ వారికి శాలువాలు, పూలదండలకు బదులుగా విద్యార్థుల గ్రంథాల యాల ఏర్పాటుకు ఉపయోగపడే పుస్తకాలను తీసుకురావాలని యువక మండలి వారు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని వారు కోరారు. అలాగే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ పక్షి మాద్రి సంస్థాన విరక్తమఠం యువక మండలి వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించి
# 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేత

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ, ఆగస్ట్ 29 (జనంసాక్షి):** వెల్దండ మండల పరిధిలోని వెల్దం డ చెర్కూర్ పెద్దాపూర్ గ్రామాలలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. శనివారం గోలి శ్రీనివాస్ రెడ్డి మృతుల కుటుంబాలను పరామ ర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం పెద్దాపూర్ గ్రామంలో మృతి చెందిన నర్సమ్మకు 5 వేల రూపాయలు అందజేశారు. అదేవిధంగా వెల్దండ గ్రామంలో మృతి చెందిన పుట్ట శ్రీశైలం కుటుంబానికి 5 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మృత్తుల కుటుంబాలకు భవిష్యత్తులో అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో వెల్దండ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు,మాజీ ఎంపీపీ పుట్టారామిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్,మాజీ మండల అధ్యక్షులు జోగయ్య, మాజీ ఎంపీటీసీ జ్యోతినిరంజన్, మాజీ సర్పంచులు అంజి నాయక్, శంకర్ నాయక్, చేర్కూర్ సర్పంచ్ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ కొండల్, రాంచంద్ర య్యా, మైసయ్య, లాలయ్య, మాజీ ఉప సర్పంచ్ నర్సింహా,బాలు, బర్కం గణేష్, రాజేందర్, ప్రవీణ్, ఆనంద్,అంజి మాస్టర్,లింగం,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**మల్దకల్, ఆగస్టు29 (జనంసాక్షి):** మండలంలోని అమర వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి హాజరు కాగాఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. అనం తరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ తూము కృష్ణారెడ్డి ప్రధానోపాధ్యాయులు కలిసి పరిశీలించారు. విద్యా ర్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన పోషకాహారంతో కూడిన భోజనం అందేలా చర్యలు తీసు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్షితుడు, ఋషిరాజు, సరిత, రవి, అరుణరాణి, పిఈటి ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలానగర్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



**బాలానగర్, ఆగస్టు 29(జనంసాక్షి):** క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందని జిల్లా యువజన అధి కారి కోట నాయక్ అన్నారు. బాలానగర్ తెలంగాణ గురుకుల రెసి డెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికల)లో శుక్రవారం మై భారత్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోట నాయక్ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఏదో ఒక క్రీడలో చురుగ్గా పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సౌమ్య, పీఈటీ శోభారాణి, ఉపాధ్యాయులు, కార్యక్రమ సమన్వయకర్త ఎస్.రాజేష్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతతో రైతుల ఆదాయం పెంచాలి

- కేవీకే పరిశోధనా కేంద్రం రైతులకు సాంకేతిక వారధిగా నిలవాలి
- డ్రోన్ టెక్నాలజీపై రైతులకు విస్తృత శిక్షణ ఇవ్వాలి
- కేవీకే, సందర్శనలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్







**బిజినేపల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి):** రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు కోసం శాస్త్రీయ సాగు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా రైతులకు చేరువ చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. కేవీకే పరిశోధనా కేంద్రం రైతులకు సాంకేతిక వారధిగా పనిచేయాలని సూచించారు. శనివారం పాలెంలోని వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ను కలెక్టర్ సందర్శించారు. కేవీకే కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, శిక్షణ కార్యక్రమాలు, ఇన్‌స్ట్రక్షనల్ ఫారంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన యూనిట్లను పరిశీలించారు. కేవీకే సీనియర్ సైంటిస్ట్, హెడ్ డా. ఓ. శైల సంస్థ ద్వారా నిర్వహిస్తున్న రైతు క్షేత్ర పరీక్షలు, శిక్షణలు, వ్యవసాయ సలహాలు, సాంకేతిక విస్తరణ కార్యక్రమాలను వివరించారు.

రైతుల వాస్తవ అవసరాలకు అనుగుణంగా కేవీకే సేవలు ఉండాలని కలెక్టర్ సూచించారు. శాస్త్రవేత్తలు రైతులతో నిరంతరం అనుసంధా నమై సమస్యలను గుర్తించి శాస్త్రీయ పరిష్కారాలు అందించాలన్నారు. మార్కెట్ డిమాండ్, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణ చేపట్టి అధిక విలువ కలిగిన పంటల ద్వారా అదనపు ఆదాయం పొందేలా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. కేవీకేలోని విత్తనశుద్ధి, షేడ్‌నెట్ నర్సరీ, వర్మీకంపోస్ట్, పందిరి కూర గాయలు, డ్రాగన్ ఫ్రూట్ తదితర యూనిట్లను పరిశీలించిన కలెక్టర్ వాటి పెట్టుబడి, నిర్వహణ వ్యయం, దిగుబడి, మార్కెట్ అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనోత్పత్తి, విత్తన శుద్ధి, నిల్వ, వినియోగంపై రైతులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని విస్తృతంగా ప్రోత్సహించాలని కలె క్టర్ ఆదేశించారు. డ్రోన్లతో పురుగుమందులు, ద్రావణాల పిచికారీ విధానం, భద్రతా జాగ్రత్తలపై రైతులకు ప్రత్యక్ష శిక్షణ, ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. డ్రోన్ వినియోగంతో సమయం, శ్రమ ఆదా అవుతుందని తెలిపారు. రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని, వ్యవసాయ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను క్షేత్రస్థాయిలో చూపించాలని కలెక్టర్ కోరారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారి మృతి.. వైద్యులపై నిర్లక్ష్య ఆరోపణలు



**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు29(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడేళ్ల చిన్నారి మృతి కలకలం రేపింది. నారాయణ పేట మండలం కొల్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకట్రాములు కుమార్తె చైత్ర (7) మృతి చెందింది, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చైత్ర రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. శని వారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చిన్నారి పరిస్థితి విషమించడంతో తల్లి దండ్రులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే దాదాపు ఐదు గంటల పాటు వైద్యం కోసం ఎదురుచూసినా సరైన స్పందన లేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.చిన్నారి పరిస్థితి మరింత విషమించడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కిడ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ కూడా సరైన వైద్యం అందలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ.తిరిగి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు.అయితే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చిన 15 నుంచి 20 నిమిషాల్లోనే చిన్నారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్లు కనీసం ముట్టుకుని కూడా చూడలేదు అరచేతుల్లో పాపను పట్టుకుని ఆస్పత్రుల చుట్టూ తిరిగినా తమ కుమార్తెను కాపాడుకోలేకపోయామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిం చారు.

చిన్నారికి సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోవైపు చిన్నారి తల్లిదండ్రులు పేషెంట్ బెడ్ వద్ద కనిపించలేదని డాక్టర్ తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే తాము తెల్లవారుజామున 4 గంటలకే ఆస్పత్రికి వచ్చి ఉదయం 9 గంటల వరకు అక్కడే ఉన్నామని వారు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు అసలు ఏం జరిగింది? చిన్నారికి సకా లంలో వైద్యం అందిందా? వైద్యంలో ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి మృతి చెందే వరకు జరిగిన పరిణామాలను పూర్తిగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే చిన్నారి మృతికి అసలు కారణాన్ని స్పష్టంగా వెల్ల డించాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలి

- జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ రంగన్న ఎల్కూర్ డిమాండ్



**మల్దకల్, ఆగస్టు 29(జనంసాక్షి):** కరెంటు ఉన్న సమయంలో కాలువలో నీరు అందడం లేదు- కాలువలో నీరు ఉన్న సమయంలో విద్యుత్ అందడం లేదని,రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ శనివారంమల్దకల్ మండల సబ్ స్టేషన్ అధికారులకు,సబ్ స్టేషన్ ఆపరేటర్ చందుకి వినతి పత్రం ద్వారా రైతుల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ ద్వారా అందజేశారు.ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ రంగన్న ఎల్కూర్ మాట్లాడుతూప్రస్తుతం పంటలు చేతికి వచ్చే సమయం కావడంతో నీటి పారుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు. అక్కడక్కడా కరెంట్ కోతలు విధించడం వల్ల మోటార్లు కాలిపోతున్నాయని, పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం లేకుండా రోజంతా కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లో-వోల్టేజ్ సమస్యలను పరిష్కరించి,కరెంట్ కోతలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఫోన్ ద్వారా స్పందించిన రాజేష్ ఏఈ అధికారి ఈ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి,త్వరలోనే 24 గంటల విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా పై అధికారులతో కలిసి చర్చించి చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు బజారన్న,రాజు, మద్దిలేటి.తిప్పన్న, బీచుపల్లి, గోకారన్న, గోపాల్, జమ్మన్న. భారత కమ్యూనిస్టు పార్టీగ్రామ కార్యదర్శి వైటి లక్ష్మన్న, సహా య కార్యదర్శి గొంగడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి పకడ్బందీ VGPPలు రూపొందించాలి





**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి):** గ్రామాల స్థానిక అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమగ్ర అభివృద్ధికి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు (VGPP) పకడ్బందీగా రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో VGPPపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య రంగాలతో పాటు తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రతి మండలంలో ప్లానింగ్ షెడ్యూల్, బృందాల వివరాలను సిద్ధం చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

**ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టాలి...**

వర్షపు నీటిని సంరక్షించేందుకు ఫార్మ్ పాండ్స్, ట్రెంచ్‌లు, సోక్‌పిట్స్, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్, వాటర్ హార్వెస్టింగ్ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఫార్మ్ పాండ్స్ వల్ల భూగర్భ జలాలు పెరిగి పంటలకు నీటి లభ్యత మెరుగుపడే ప్రయోజనాలను రైతులకు వివరించి ప్రోత్సహించాలని అన్నారు.

**క్షేత్రస్థాయిలో సమన్వయం...**

ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందితో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి సర్పంచులు, ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు.

**ఉపాధి హామీ పనులపై దృష్టి...**

లేబర్ మొబిలైజేషన్ పెంచాలని, తక్కువ లేబర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి అవకాశాలు, కూలి చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాను అన్ని అభివృద్ధి సూచీల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని మధుసూదన్ నాయక్ కోరారు. DRDO నరసింహులు, ఉద్యాన, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు తమ శాఖల పథకాలను VGPPలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ZP CEO వెంకటరెడ్డి, అదనపు DRDO వామన్‌రావు, ఎంపీడీవోలు, APOలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

- **సిద్దిపేట జిల్లా జడ్జ్ ఆర్.సుదర్శన్**




**సిద్దిపేట బ్యూరో ఆగస్టు 29 (జనంసాక్షి):** సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ పడదగ్గ కేసులతో పరిష్కరించే వీలున్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని డిస్టిక్ సెషన్స్ జడ్జ్ ఆర్. సుదర్శన్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టు లో జిల్లా సెషన్స్ జడ్జి ఆర్ సుదర్శన్ జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి సౌజన్యతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడుతూ సెప్టెంబర్ 12న జిల్లా కోర్టుతో పాటు సిద్దిపేట జిల్లా లోని దుబ్బాక గజ్వేల్, చేర్యాలఖ్, హుస్నాబాద్ లో గల కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాజీ ద్వారా పరిష్కరించదగ్గ కేసులను పరిష్కరించడం జరుగుతుంది కాబట్టి కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం మార్చి నెలలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా 756 కేసులు పరిష్కరించడం జరిగిందని. వాటిలో మోటార్ వాహనాల సంబంధించిన కేసులో 92 లక్షల 26 వేల నష్టపరిహారం ఇప్పించడం జరిగిందని బ్యాంకు కేసులకు సంబంధించి 30 లక్షల 32 వేల రూపాయలు సెటిల్ చేయడం జరిగిందని అన్నారు.

జూన్ లో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా 814 కేసులు పరిష్కారమయ్యాయని వీటిలో మోటర్ వాహనాలకు సంబంధించిన కేసులో 78 లక్షల 65000 రూపాయల నష్టపరిహారం ఇప్పించడం జరిగిందని, బ్యాంకు కేసులకు సంబంధించి 5 లక్షల 77 వేల రూపాయల సెటిల్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. ఇవే కాకుండా జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ద్వారా పోక్సో కేసులలో బాధితులకు 25 లక్షల రూపాయల అవార్డు కాగా 4 లక్షల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ద్వారా పరిష్కరించేందుకు 1776 కేసులను గుర్తించడం జరిగిందని వాటిలో 518 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేయడం జరిగిందని, చెక్ బౌన్స్ సంబంధించిన 1323 కేసులను గుర్తించి నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. కావున సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పరిష్కరించే వీలున్న కేసుల కు సంబంధించిన కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ జడ్జి సూచించారు.

# మాతృభాషకు మకుటం పెట్టిన అర్జున్ పట్ల విద్యార్థులు

- **అలరించిన ఆధునిక భువన విజయం**
- **ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం**
- **ఆకట్టుకున్న వేమన గిడుగు వేషధారణ, బుర్రకథ**



**చేర్యాల, ఆగస్టు 29(జనంసాక్షి):** తెలుగు భాషా దినోత్సవంను పురస్కరించుకుని చేర్యాల మండలం లోని అర్జునపట్ల ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు తెలుగు భాషకు పట్టాభిషేకం చేశారు. సుమారు 15 భాషా ప్రక్రియలతో తెలుగు భాష ఔన్నత్యం చాటారు. గిడుగు రామ్మూర్తి వేషధారణతో, శ్రీకృష్ణ దేవరాయలు వేష ధారణ తో 10 వతరగతి విద్యార్థిని భవిష్య తన అద్భుత నటన, భాషా ప్రతిభతో ఆకట్టుకోగా, గొల్లపల్లి అక్షిత భాషా ధారణతో బుర్రకథ బ్రీత్లేస్ ఏకపాత్రాభినయంతో అలరించి ఆకట్టుకోవడమే కాకుండా ప్రైజ్ మని కూడా గెలుచుకున్నారు. భానుప్రియ అద్భుత భాషా గానం అలరిం చింది. అష్టదిగ్గజాలు గా రసజ్ఞ, రక్షిత, ఆయేషా, శరణ్య, అశ్విని, హర్షిణి తదితరులు తమ పాండితీ ప్రకర్షను చాటారు. ప్రస్తుతం విద్యార్థులకు చదవడం రాయడం ఎందుకు రావడం లేదు, ఒకవేళ చదువు రావాలంటే తీసుకోవాల్సిన ప్రణాళికలు ఎంటి అనే విష యంతో బుర్రకథ, ఆధునిక భువన విజయం రామచంద్రమూర్తి స్వీయ రచన దర్శకత్వం నిర్వహణలో అద్భుత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభచాటినవారికి నగదు బహుమతి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు ప్రధానోపాధ్యాయులు అందచేసారు. అవధానం పద్య పఠనం పాఠ్య పఠనం, క్విజ్, వేమన వేషధారణ తదితర 15 అంశాల్లో కార్యక్రమాలు నిర్వహించి తెలుగున మాతృభాష మహోన్నతంగా నిలబెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరీంచంద్ర కులకర్ణి, సరిత, నర్సింహులు, రజిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# రాష్ట్రపతి భవన్‌లో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న ఏకలవ్య విద్యార్థిని

**వెల్దండ, ఆగస్టు 29 (జనంసాక్షి):** రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎ. వైష్ణవి పాల్గొన్నారు. భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముతో ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ ఉపాధ్యాయులు రీనా , అనీషా, గీతు చంద్రన్ మరియు విద్యార్థులు అభినందించారు. ఇది ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఒక మరపురాని గర్వకారణమైన ఘట్టమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# రోడ్డు కోసం పాదయాత్ర చేయడం సిగ్గుచేటు

- **అబద్దాల పార్టీ బిఆర్ఎస్**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి**



**వెల్దుర్తి, ఆగస్టు 29 (జనంసాక్షి):** వెల్దుర్తి నుండి మెదక్ వరకు బిఆర్ఎస్ నాయకులు రోడ్డు కోసం మహా పాదయాత్ర చేయడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు హనుమాన్ గారి నరేందర్ రెడ్డి విమర్శించారు శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మండల నాయకులు హాజరై మాట్లాడారు టిఆర్ఎస్ పార్టీ పూర్తి అబద్దాల పార్టీ అని గత పది సంవత్సరాలు రాష్ట్రంలో అధికారంలో ఉండి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి ఏం చేశారని వారన్నారు తమ రాజకీయ ఉనికి కోసం ఈ పాదయాత్ర చేయడం పరమ సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు అన్నారు గత పది సంవత్సరాలలో టిఆర్ఎస్ పార్టీ వెల్దుర్తి మండలానికి చేసింది ఏమీ లేదని రాజకీయ లబ్ధి కోసమే మండల నాయకులను వాడుకున్నారని మండల అభివృద్ధిలో ఎలాంటి మార్పు రాలేదని వారన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి. మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ తలారి మల్లేశం కిష్ట గౌడ్ బంజరవి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మఖ్తల్ మండల ఉప సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా రాఘవేందర్ రెడ్డి ఎన్నిక



**మక్తల్, ఆగస్టు 29 (జనంసాక్షి):**

ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుం టానని మక్తల్ మండల ఉప సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్ ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు మ్యాతరి గోపాల్ ఆధ్వర్యంలో శనివారం మక్తల్ పట్టణ కేంద్రంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కె. సత్యన గౌడ్, ప్రధాన కార్యదర్శి నంబర్ తిరుపతి, కోశాధికారి యం. సురేష్, జిల్లా కమిటీ సభ్యులు వాకిటి రమేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని ఉప సర్పంచులకు ఏ సమస్య వచ్చినా సంఘం అం డగా ఉంటుందని, గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎల్కోటి చెన్నప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ తయాప్ప, ఉపాధ్యక్షురాలు శిరీష, అధికార ప్రతినిధి మాలరాజుతో పాటు మండల ఉప సర్పంచులు రామలింగప్ప, శివాని, ఎం.శ్రీనివాసులు, సి.మల్లేష్, నస్రిన్ బేగం, సురేష్, మల్లేష్, నరసింహ గౌడ్, గుడిసె జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

• అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



జడ్చర్ల, ఆగస్టు 29 (జనంసాక్షి): జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, పారిశుద్ధ్య, పౌర సేవల కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, పనుల్లో వేగం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల స్థితిగతులు, పారిశుద్ధ్య నిర్వహణ, పౌర సేవలు, పన్నుల వసూళ్లు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై సమీక్షించారు. ప్రారంభమైన అభివృద్ధి పనులను నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పట్టణంలో పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించుకోవడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పన్నులు, బకాయిలను త్వరగా వసూలు చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు.

## ట్రిబుల్‌ఆర్ భూసేకరణలో మెదక్ అధికారుల సమన్వయం భేష్



మెదక్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి): రీజినల్ రింగ్ రోడ్ (RRR) భూసేకరణ ప్రక్రియలో మెదక్ జిల్లా రెవెన్యూ, నేషనల్ హైవే అధికారుల సమన్వయం అభినందనీయమని ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ ఐఏఎస్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులతో భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోల నుంచి భూసేకరణ వివరాలను తెలుసుకున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే మెదక్‌లో కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రక్రియ వేగంగా సాగుతోందని గంగాధర్ తెలిపారు. అవార్డు పాసైన భూములను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసి, రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ భూసేకరణలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, అవార్డు పాసైన భూములకు త్వరగా పరిహారం మంజూరయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. భూసేకరణను వేగంగా పూర్తి చేస్తే RRR నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయని అన్నారు. సమీక్షలో అధికారులు పాల్గొన్నారు.

## బీరంగూడ శ్రీకృష్ణనగర్‌లో అక్రమ అంతస్తులపై కొరడా

• నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అంతస్తులను ఎ కొలిచివేసిన అమీన్పూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు



అమీన్పూర్, ఆగస్టు 29 (జనంసాక్షి): అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ శ్రీకృష్ణనగర్ కాలనీలో అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తులపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులకు మించి నిర్మించిన అంతస్తులను అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. శ్రీకృష్ణనగర్ కాలనీలో భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన అమీన్పూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగారు. సంబంధిత భవనాలను పరిశీలించిన అనంతరం, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులపై కొలతలు చేపట్టి అక్రమ నిర్మాణాల వివరాలను నమోదు చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందని, నిబంధనలను అతిక్రమించి భవనాలు నిర్మించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. భవన యజమానులు అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బీరంగూడ శ్రీకృష్ణ నగర్‌లో అక్రమ అంతస్తులపై టౌన్ ప్లానింగ్ అధికారుల చర్య స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో అమీన్పూర్ సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలపైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## ముగుదంపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మునిపల్లి, ఆగస్టు 29(జనంసాక్షి): మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని ముగ్దుంపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయికోడు మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, గ్రామ జీపీట రాజు పాల్గొని లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

# అప్పలాయి చెరువు సర్పంచ్ పెద్దమ్మల సత్యంకి బ్రెయిన్ స్ట్రోక్

### సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించిన మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



నంగునూరు, ఆగస్టు 29 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం అప్పలాయి చెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు హఠాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ (మెదడు పక్షవాతం) రావడంతో కుటుంబ సభ్యులు తక్షణమే సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్ రావు తక్షణమే స్పందించారు. సర్పంచ్ సత్యం ఆరోగ్య పరిస్థితిపై యశోద హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి, అదేరోజు అత్యవసరంగా సర్జరీ (శస్త్ర చికిత్స) జరిగేలా చొరవ తీసుకున్నారు. సర్జరీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని హరీష్ రావు వైద్యులను అడిగి తెలుసుకుంటూ, నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. శనివారం రోజు హాస్పిటల్‌కు స్వయంగా వెళ్లిన హరీష్ రావు, సర్పంచ్ పెద్దమ్మల సత్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెబుతూ, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో హరీష్ రావుతో పాటు నంగునూర్ మండల బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మరియు యూత్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# గురుకుల ప్రాంగణాలను శుభ్రంగా ఉంచాలి: జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి): విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురికాకుండా వంటగదిలో మరియు గురుకుల ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల ప్రిన్సిపల్ ను ఆదేశించారు. శనివారం మిరుదొడ్డి మండలంలోని అల్వాల్ గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ రోజు మధ్యాహ్నం వంట కోసం వండిన అన్నం, పప్పు, బెండకాయ కూర, రసం, పెరుగు లను పరిశీలించారు. కూర నాణ్యత మెరుగుపరచాలని సూచించారు. కామన్ డైట్ మెనూలో భాగంగా గుడ్డు ఎందుకు పెట్టలేదని అడగ్గ సాయంత్రం ఎగ్ బజ్జి పెడతామని, దానికోసం గుడ్లు ఉడకబెడుతున్నట్లు వంట సిబ్బంది కలెక్టర్‌కి తెలిపారు. కూరగాయలు మంచి నాణ్యమైనవి మాత్రమే వాడాలని, ఆదేశించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండడం చూసి అసహనం వ్యక్తం చేస్తూ విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురైతే సహించేది లేదని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి సమయవేళల్లో ప్రతి రోజూ వంట పూర్తి కాగానే శుభ్రం చేసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి పలకరిస్తూ భోజనం ఎలా ఉంది, రుచిగా ఉందా, రోజు మెనూ ప్రకారం పెడుతున్నారా ఆరా తీశారు. రుచిగా ఉందని, మెనూ ప్రకారం పెడుతున్నారని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు. ఆహారం బాగా నమిలి తినాలని, ఆహారం వృధా చెయ్యకూడదని, అన్నం పరబ్రహ్మ స్వరూపం అని విద్యార్థులకు తెలిపారు.

## పోచారం ప్రాజెక్టు.. పర్యాటకుల సందడి సూపర్



హవేలిఘనపూర్ మండలం, ఆగస్టు 29 (జనంసాక్షి): మెదక్–కామారెడ్డి జిల్లా సరిహద్దులోని హవేలిఘనపూర్ మండలం పోచారం ప్రాజెక్టు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గత నెల రోజులుగా ప్రాజెక్టు పొంగిపొర్లుతుండటంతో వారాంతంలో పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్టు మత్తడి వద్ద యువత నీటిలో సందడి చేయగా, కుటుంబ సభ్యులు సైతం అక్కడికి చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. పలువురు పర్యాటకులు అక్కడే వంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తూ ఆనందంగా గడిపారు. పెద్ద సంఖ్యలో వాహనాల్లో పర్యాటకులు చేరుకోవడంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు జనసందోహంగా మారాయి. ఆహ్లాదకరమైన వాతావరణం, జలకళతో పోచారం ప్రాజెక్టు ప్రస్తుతం పర్యాటక స్పాట్‌గా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

# 34 ఏళ్లకు పైగా ప్రజాసేవకు వీడ్కోలు

• కోహీర్ నాయబ్ తహసీల్దార్ వై. యాసిన్ ఖాన్ పదవీ విరమణ

• వివిధ హోదాల్లో సేవలందించిన అనుభవజ్ఞుడైన రెవెన్యూ అధికారి



కోహీర్, ఆగస్టు 29 (జనంసాక్షి): రెవెన్యూ శాఖలో సుమారు 34 సంవత్సరాల 6 నెలలపాటు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించిన కోహీర్ మండల నాయబ్ తహసీల్దార్ వై. యాసిన్ ఖాన్ ఆగస్టు 31, 2026న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం కోహీర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న యాసిన్ ఖాన్ తన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో గ్రామ పరిపాలనాధికారి, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సీనియర్ అసిస్టెంట్, గిర్దా వర్, నాయబ్ తహసీల్దార్ తదితర హోదాల్లో విధులు నిర్వర్తించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన అధికారిగా ఆయన సేవా ప్రస్థానం కొనసాగింది.

**ఇలా సాగిన సేవా ప్రస్థానం...**

**1. 1992–1996:** జీర్గపల్లి, ఝరాసంగం మండలంలో గ్రామ పరిపాలనాధికారిగా సేవలు.

**2. 1996–2002:** మచ్‌నెల్లి, షేఖాపూర్, రూపన్‌పూర్, జహీరాబాద్ మండలాల్లో గ్రామ రెవెన్యూ అధికారిగా విధులు.

**3. 2002–2011:** పైడిగుమ్మల, నాగరెడ్డిపల్లి, కోహీర్ మండలాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోగా సేవలు.

**4. 2011–2012:** పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి, పోతిరెడ్డిపల్లి, కృష్ణారెడ్డిపేట్, ఐలాపూర్ ప్రాంతాల్లో వీఆర్వోగా విధులు.

**2012–2013:** నారాయణఖేడ్, మనూర్, న్యాల్కల్ మండలాల్లో సీనియర్ అసిస్టెంట్, గిర్దావర్‌గా సేవలు.

**2013–2023:** జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లో గిర్దావర్‌గా విధులు నిర్వర్తించారు.

**2023–2026:** ఝరాసంగం, జిన్నేపల్లి, కోహీర్ మండలాల్లో నాయబ్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు.

**సహచరుల అభినందనలు...**

సుదీర్ఘకాలం రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందుతున్న వై. యాసిన్ ఖాన్‌కు రెవెన్యూ శాఖ సిబ్బంది, సహచర అధికారులు, స్థానిక ప్రజలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను కొనియాడుతూ, పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితం అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.